సాక్షి
కామారెడ్డి
బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



వామ్మో.. ఏఎంసీ పదవా?
ఆ ఏఎంసీ చైర్‌పర్సన్‌లుగా పనిచేసినవారు అనారోగ్యం పాలవుతున్నారు. వాస్తు దోషం ఉందన్న ప్రచారం జరుగుతోంది.
- 8లో ▶



కార్మికుల ధర్నా
డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు.
- 9లో ▶

గరిష్టం/కనిష్టం
30.7 /23.0

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

18 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా ఈ నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఈనెల 18 వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 15 వరకే బియ్యం పంపిణీ చేస్తామని ముందుగా ప్రకటించినా.. వర్షాలు కురవడం , వినాయక చవితి తదితర సెలవులు రావడంతో రేషన్ పంపిణీ పూర్తి స్థాయిలో జరగలేదు. అంతేకాకుండా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఇప్పటివరకు రేషన్ షాపులకు పూర్తిస్థాయిలో బియ్యం కూడా సరఫరా కాలేదు. దీంతో రేషన్ బియ్యం పంపిణీ గడువు తేదీని పొడిగిస్తూ పౌరసరఫరాల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన జిల్లా నేతలు




కామారెడ్డి టౌన్: పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం జిల్లాకు చెందిన నేతలు హైదరాబాద్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిని కలిసినవారిలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఉన్నారు.


13న ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీలు

కామారెడ్డి టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న దోమకొండలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా క్రీడల కార్యదర్శి హీరాలాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో సత్తాచాటినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల 17 ఏళ్లలోపు బాలబాలికలు ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్‌కార్డులను తీసుకుని పోటీలకు రావాలని సూచించారు.

దివికేగిన అక్షర శిల్పి!



- ప్రముఖ కవి అయాచితం నటేశ్వర శర్మ అస్తమయం
- అష్టావధానిగా, సంస్కృతాంధ్ర పండితుడిగా గుర్తింపు
- ప్రాచ్య కళాశాల ద్వారా ఎందరినో తీర్చిదిద్దిన గురువు
- సాహితీ రంగానికి తీరని లోటన్న అభిమానులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ''బ్రహ్మదేవుడు ఇచ్చిన చేతులతో బ్రహ్మాండంగా రాయకుండా యంత్రాల రాతలెందుకు? నియంత్రణల తలరాతలెందుకు? చేతిరాతల అందం భూతలంలో ఏ రాతకూ లేదు.. రాస్తుంటేనే అందం'' అంటూ చేతిరాత ఔన్నత్యాన్ని 'బ్రహ్మ ఇచ్చిన రాతలు' కవితలో వివరించిన అక్షర శిల్పి, ప్రముఖ కవి, రచయిత, అష్టావధాని, దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ మంగళవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. ''అక్షరాలు నర్తిస్తాయి అంతరంగ వేదికపై.. అచ్చుల లాస్యాలూ హల్లుల తాండవాలూ ఉల్లమంతా నిండిపోతాయి.. ఆహా అని ఆనందించేంతలోనే మెరుపు తీగలవలె మాయమౌతాయి'' అన్న నటేశ్వరశర్మ సాహితీ అభిమానులను శోక సంద్రంలో ముంచుతూ దివికేగారు. ఆయనకు భార్య అరుణకుమారి, ముగ్గురు కూతుళ్లు కౌముది, జాహ్నవి, యామిని ఉన్నారు.

సాహితీ సేవ..

సంస్కృత ఆచార్యులుగా అందరికీ సుపరిచితులైన నటేశ్వరశర్మ.. అవధానిగానూ గుర్తింపు పొందారు. అవధాని శశాంక, శతావధాని సమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ అవధానాలతో స్ఫూర్తిపొందిన ఆయన.. డాక్టర్ రంగనాథ వాచస్పతితో కలిసి జంట అవధానాలు చేశారు. వారిద్దరు కలిసి వందకుపైగా అవధానాలు చేశారు. ఆయన సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అంతర్యామి శీర్షికతో ఆయన చేసిన రచనలు ఎందరినో కదిలించాయి. ఆయన రూపొందించిన సంస్కృత సంగీత రూపకం 'నాగిని' పేరుతో ఇటీవల హైదరాబాద్ ఆకాశవాణిలో ప్రసారమై రామప్ప దేవాలయ శిల్పకళా వైభవాన్ని చాటింది. విద్యార్థి దశలో రాసిన వచన కవితా సంపుటి 'విశ్రాంతిగీతి' దాశరథి ప్రశంసలు అందుకుంది. సంస్కృతాంధ్ర భాషల్లో ఆయన 50కి పైగా రచనలు చేశారు. తొలి గేయ సంపుటి వసంతకుమారి 1981లో వచ్చింది. ఖండకావ్యాలలో సమయ విలాసిని, సౌదామినీ విలాసం, పంచశరీయం, చుక్కలు, చైత్రరథం, ఆటవెలది, జీవనయానం విశిష్ట రచనలుగా కీర్తిని పొందాయి. వ్యావహారిక భాషలో రాసిన కవితా శతకం .. శ్రీశ్రీ రచన సిరిసిరి మువ్వను తలపిస్తుంది.

దస్తూరి 'అయాచిత' వరం

ఆయనకు దస్తూరి అయాచిత వరం. కాగితంపై ముత్యాలను పేర్చినట్లుగా.. అక్షరాలను పోతపోసినట్లుగా ఆయన చేతిరాత ఉండేది. ఆ దస్తూరి చూసి ముగ్ధులుకాని వారుండరంటే అతిశయోక్తి కాదు. స్వదస్తూరితో 35 పేజీల పుస్తకాన్ని ముద్రించారు. కవర్ పేజీపై పేరుతో సహా అన్నీ ఆయన చేతి రాతతోనే ఉండడం విశేషం.



నటేశ్వర శర్మ రాసిన పుస్తకాలు

సాహితీవేత్తల సంతాపం

నటేశ్వరశర్మ మరణం తెలుగు సాహితీ రంగానికి తీరని లోటని కామారెడ్డికి చెందిన పలు సాహితీ సంస్థలు, కవులు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. సూరారం శంకర్, డాక్టర్ వి.శంకర్, సుమిత్రానంద్, మెంగవరం పవన్‌కుమార్, మంద పీతాంబర్, ఎనిశెట్టి గంగాప్రసాద్, వై.సాయిలు, కొల్లు రంగారావు, సిరిసిల్ల గఫూర్ శిక్షక్, అల్లి మోహన్‌రాజ్, కల్లెం నవీన్‌రెడ్డి, కొడి రవీందర్, నమిలికొండ సునీత, ఓం ప్రకాశ్, సుప్పని సత్యనారాయణ, మొగిలి స్వామిరాజ్ తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు. గొప్ప ధార్మిక, ఆధ్యాత్మిక, సాహితీవేత్తను కోల్పోయామని వేదపండితులు గంగవరం ఆంజనేయశర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వందలాది మందిని తీర్చిదిద్ది..

అయాచితం నటేశ్వర శర్మ 1956 జూలై 17న రామారెడ్డి మండల కేంద్రంలోని సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. 1970లో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి తిరుమల శ్రీ వేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థిగా ఉన్న నటేశ్వర శర్మ సంస్కృత శ్లోకాలతో స్వాగతం పలకడంతో ఆయన ఆశ్చర్యపోయారు. మంచి కవిగా ఎదుగుతావని ఆశీర్వదించారు. నటేశ్వరశర్మ తిరుపతి వేంకటేశ్వర సంస్కృత విశ్వవిద్యాలయంలో భాషా ప్రవీణ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. 1977 లో కామారెడ్డి ప్రాచ్య కళాశాలలో సంస్కృత విభాగం ఆచార్యులుగా చేరారు. కామారెడ్డి ప్రాచ్య కళాశాలలో ఆచార్యులుగా, ప్రధాన ఆచార్యులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. 2011 నుంచి 2013 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య భాషా విభాగానికి పీఠాధిపతిగా (డీన్)గా కూడా సేవలందించారు. 2014 జూలైలో ఉద్యోగ విరమణ పొందారు. కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ తదితర జిల్లాల్లో ఆయన శిష్యులున్నారు. ఆయన శిష్యులు వందలాది మంది తెలుగు పండితులుగా ఉద్యోగాలు పొందారు.

నటేశ్వరశర్మ రచించిన అభిజ్ఞాన శాకుంతలానికి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ కావ్య పురస్కారం లభించింది. దేశభక్తి కవితా సంపుటి భారతీ ప్రశస్తికి జాతీయ సాహిత్య పరిషత్తు పురస్కారం వరించింది. రుతువుల సోయగాలను వర్ణిస్తూ రచించిన రుతుతీగకు ఉత్తమ కావ్య పురస్కారం దక్కింది. తెలంగాణ రాష్ట్ర వైభవాన్ని ప్రస్తుతిస్తూ సం

వరించిన పురస్కారాలెన్నో..

స్కృతంలో రాసిన తెలంగాణ సుప్రభాతం తెలంగాణ మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురితమై పాఠకులను ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్రావిర్భావం తర్వాత 33 జిల్లాల ప్రత్యేకతలను తెలుపుతూ రాసిన పద్యాలు ఈ నేల విశిష్టతను చాటాయి. ఆయన అవధాన ప్రతిభకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం లభించింది. ఆదిశంకరాచార్యులు రచించిన సౌందర్యలహరిపై పరిశోధనలకుగాను 1994లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను, స్వర్ణ పతకాన్ని అందుకున్నారు. ఆముక్తమాల్యదపై ఆయన రాసిన విమర్శనా గ్రంథం ప్రామాణికమైంది. ఆయన విశిష్ట సాహిత్య సేవలను గుర్తించిన భక్తిసాధనమ్ అనే ఆధ్యాత్మిక సంస్థ గజారోహణంతో సత్కరించింది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది దాశరథి పురస్కారంతో గౌరవించింది. పలు సాహితీ, ఆధ్యాత్మిక సంస్థలు ఆయనకు పురస్కారాలు అందించి సత్కరించాయి.

పర్యాటకులకు వసతులు కల్పించాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న పర్యాటకులకు కనీస వసతులు కల్పించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. స్థానిక అధికారులతో మాట్లాడి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాలతో పాటు పక్క జిల్లాల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించడానికి చాలా మంది వస్తుంటారన్నారు. వారికి అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, శంకర్, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'వీర వనిత చాకలి ఐలమ్మ'



కామారెడ్డి క్రైం: వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీర వనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐలమ్మ ధైర్యసాహసాలు, చైతన్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, వసతి గృహాల సంక్షేమ అధికారులు చక్రధర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

- అట్రాసిటీ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న చైర్మన్ బక్కి వెంకటయ్య, పక్కన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: జిల్లాలోని అన్ని గ్రామాలలో ప్రతి నెలాఖరు రోజున సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో లాండ్ సర్వీసెస్, అట్రాసిటీ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అఘాయిత్యాలు, కేసులకు సంబంధించిన వివరాలు సేకరించి నివేదికలు సమర్పించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే అర్జీదారులను గౌరవించి సమస్యలను తెలుసుకోవాలని పోలీసులకు సూచించారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన వసతి గృహాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు పోలీస్ శాఖ ద్వారా నమోదైన కేసుల వివరాలను ఎస్పీ సింధు శర్మ వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు రంగనాథరావు, ప్రభాకర్, డీఎస్పీలు శ్రీనివాసులు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, కమిషన్ సభ్యులు నీలాబాయి, లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

- 2 వేల ఎకరాల్లో పామాయిల్, వంద ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి..
- రైతులనుంచి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఆయిల్‌పాం, పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆసక్తి గల రైతులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ విషయమై జిల్లా ఉద్యాన శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 2 వేల ఎకరాల్లో ఆయిల్ పాం, 102 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలన్నది లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ఉద్యాన అధికారులు పేర్కొన్నారు. సబ్సిడీపై మొక్కలు అందించనున్నట్లు తెలిపారు.

సబ్సిడీ వివరాలు..

ఆయిల్‌పాం సాగులో భాగంగా ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీ, రైతులకు 100 శాతం, బీసీ, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 80 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలు సరఫరా చేయనున్నారు. ఆయిల్‌పాం మొక్కలు పెంచి రైతులకు సరఫరా చేసే బాధ్యతను ఓ ప్రైవేట్ కంపెనీకి అప్పగించారు. ప్రభుత్వ ఒప్పందం ప్రకారం సంబంధిత కంపెనీ నిర్దేశించిన ధరకు పంటలను కొనుగోలు చేస్తుందని ఉద్యాన అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 207 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటామని తెలిపారు. ఎకరాకు 50 మొక్కలు నాటాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆయిల్‌పాం సాగు చేస్తే నాలుగేళ్ల తర్వాత నుంచి పంట చేతికి వస్తుందని తెలిపారు. ఏడెనిమిదేళ్ల పెంచిన ఆయిల్‌పాం తోట నుంచి ఎకరానికి 8 నుంచి 10 టన్నుల దిగుబడితో ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు నికర ఆదాయం పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

సంప్రదించాల్సిన ఉద్యాన అధికారుల వివరాలు

డివిజన్	ఉద్యాన అధికారి	ఫోన్ నంబర్
కామారెడ్డి	రామకృష్ణ	89777 14026
ఎల్లారెడ్డి	హర్షవర్ధన్‌రెడ్డి	89777 14022
బాన్సువాడ	సంతోషి రాణి	89777 14030
జుక్కల్	సుమన్	89777 14029

'హాస్టళ్లలో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి'



కామారెడ్డి క్రైం: జిల్లాలోని మైనారిటీ, సోషల్ వెల్ఫేర్, జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతులకోసం ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో వసతి గృహాల ప్రిన్సిపాల్స్, ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్లాబ్ రిపేర్, పైప్‌లైన్ లీకేజీ, మరుగుదొడ్లకు అవసరమైన మరమ్మతులను గుర్తించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వసతి గృహాలలోని విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. సమస్యలు రాకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈవో రాజు, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రజిత, మైనారిటీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారి దయానంద్, వివిధ గురుకుల పాఠశాలల ఆర్సీవోలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ధర్మాసుపత్రిలో మందుల కొరత

- సీజనల్ వ్యాధులతో పెరిగిన రద్దీ
- అరకొరగా సరఫరా అవుతున్న మందులు
- మెడికల్ షాప్‌లలో కొనుక్కోవాలని సూచిస్తున్న వైద్యులు
- జిల్లా అంతటా ఇదే పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న పేదలు

వైద్యం కోసం సర్కారు దవాఖానాలకు వస్తున్న పేదలకు సరైన వైద్య సేవలు అందడం లేదు. మందుల కొరత తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని మందులే ఇస్తున్నారని, మిగిలినవి మెడికల్ షాప్‌లో కొనుక్కోవాలని సూచిస్తున్నారని రోగులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునే స్థోమత లేకే సర్కారు దవాఖానాకు వస్తున్నామని, మెడికల్ షాప్‌కు వెళ్లి మందులు కొనుక్కోవాలంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జీజీహెచ్‌లో ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద బారులు తీరిన రోగులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో కామారెడ్డిలో 330 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు వంద పడకల ఏరియా ఆస్పత్రులు రెండు, 30 పడకల సీహెచ్‌సీలు ఏడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 19 ఉన్నాయి. అన్ని ఆస్పత్రులలోనూ సుమారు మూడు నెలలుగా మందుల కొరత తీవ్రంగా ఉంది. నొప్పుల గోలీలు, యాంటీ బయాటిక్స్, అయింట్‌మెంట్‌లు, గ్లూకోజ్ బాటిళ్లు, ఐవీ సెట్స్, నీడిల్స్, దగ్గుమందులు లాంటి ప్రధానమైన మందుల కొరత తీవ్రంగా ఉంది.

పెరిగిన రోగుల తాకిడి

విష జ్వరాలు, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ లాంటి వ్యాధులతో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల తాకిడి పెరిగింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి గతంలో రోజూ 600–800 మంది రోగులు వచ్చేవారు. ప్రస్తుతం జ్వరాల వ్యాప్తి పెరగడంతో రోజూ 1200లకు పైగా ఓపీ నమోదవుతోంది. ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. రోగుల తాకిడి పెరగడంతో మందుల కొరత ఏర్పడింది. సీజనల్ వ్యాధులు వ్యాపించే కాలమని తెలిసినా ప్రభుత్వం సైతం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో సమస్య తీవ్రత పెరిగింది.

గతంలో డీఎంఈ, టీవీవీపీ పరిధిలోని ఆస్పత్రుల బడ్జెట్ నుంచి టెండర్ విధానంలో ఏజెన్సీల నుంచి మందులు కొనుగోలు చేసేవారు. రెండు నెలలుగా నిధులు లేకపోవడంతో కొనుగోళ్లు నిలిపివేశారు. మరోవైపు రాష్ట్ర వైద్యశాఖ నుంచి మందుల పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదు. గత నెల 24వ తేదీన కామారెడ్డి జీజీహెచ్‌కు 83 రకాల మందులు కావాలని ఫార్మసిస్ట్ ఇండెంట్ పెట్టగా.. 13 రకాల మందులను మాత్రమే సరఫరా చేశారు. ప్రభుత్వం మందులు సరఫరా చేయకపోవడంతో వైద్యాధికారులు, ఫార్మసిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రులలో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇటీవల తీవ్ర జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ రాజంపేట మండలానికి చెందిన ఓ బాలుడు జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షించిన వైద్యులు మందులు రాసిచ్చారు. ఆస్పత్రిలో అందుబాటులో లేని మందులను మెడికల్ షాప్‌లో కొనుక్కోవాలని సూచిస్తూ ప్రిస్క్రిప్షన్‌లో టిక్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులలో ఫీజులు, మందుల భారం భరించలేక సర్కారు దవాఖానాకు వస్తున్న పేదలు.. మందులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

కొరత లేకుండా చూడాలి



నాతో పాటు మా 4 నెలల బాబుకు జ్వరం వచ్చింది. ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకు చూపించుకున్నాం. కొన్ని మందులే ఇచ్చారు. మిగతావి బయట తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మందుల కొరత లేకుండా చూడాలి.
– మహమ్మద్ జబార్, కామారెడ్డి

బయట కొనుక్కోమంటున్నారు



నాకు జ్వరం వచ్చింది. కాలికి గాయమైంది. సగమే గోలీలు ఇచ్చి మిగతావి బయట తీసుకోవాలంటున్నరు. కూలి పనులు చేసుకుని బతికెటోళ్లం.. ప్రైవేట్‌కు వెళ్లడానికి డబ్బులు లేకే ప్రభుత్వాస్పత్రులకు వస్తున్నం. మెడికల్ షాప్‌కు వెళ్లి మందులు ఎలా కొనుక్కోగలం.
– కిషన్, క్యాసంపల్లి తండా, కామారెడ్డి

ఇబ్బంది రాకుండా చూస్తున్నాం



సీజనల్ వ్యాధులతో రోగుల తాకిడి రెట్టింపు కావడంతో మందుల కొరత ఏర్పడుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. మందుల పరంగా ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. అవసరం ఉన్నవాటిని కొనుగోలు చేస్తున్నాం.
– రాంసింగ్, సూపరింటెండెంట్, జీజీహెచ్, కామారెడ్డి

క్లుప్తంగా

రాహుల్‌గాంధీని కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



ఎల్లారెడ్డి : అమెరికాలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉన్న రాహుల్‌ను మదన్ మోహన్ కలిసి అభినందనలు తెలిపారు.

మానసిక ఒత్తిడికి గురికావద్దు



కామారెడ్డి టౌన్ : మానవాళికి కష్టాలు సహజమేనని మానసిక ఒత్తిడికి గురికావద్దని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రమణ తెలిపారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా సూర్య హెల్త్ ఆర్గనైజేషన్, ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి, రాజేంద్రకుమార్, విక్రమ్, రాజేందర్, ఫణికుమార్,సంతోష్, రాహుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజం కోసం కృషి చేయాలి



కామారెడ్డి టౌన్ : హెచ్‌ఐవీ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంసింగ్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ బాధితుల శస్త్ర చికిత్సల గురించి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శరత్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ అభిసారిక, కౌన్సిలర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ధర్మారం హాస్టల్‌లో స్పాట్ అడ్మిషన్లు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : జిల్లా ధర్మారంలో గల బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 12వ తేదీన ఎస్సీ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు ఉన్నాయని తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపల్ శిరీష తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే ఎస్సీ బాలికలకు మాత్రమే అవకాశముందన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు వారి ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటల వరకు ధర్మారం లోని గురుకుల పాఠశాలకు వెళ్లినట్లయితే నేరుగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

హైదరాబాద్‌లో సమావేశానికి తెయూ అధ్యాపకులు



భిక్కనూరు : హైదరాబాద్‌లోని పార్క్‌ప్లాజాలో ఎన్విరాన్మెంటల్ సిస్టమ్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ యూజర్ కాన్ఫరెన్స్ 2024 (జీఐఎస్ మ్యాపింగ్ అండ్ బెటర్ ఫ్యూచర్) అనే అంశంపై నిర్వహించిన సమావేశానికి సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, అధ్యాపకులు డాక్టర్ ప్రతిజ్ఞ, నారాయణగుప్త హాజరయ్యారు. 160 సేవలను ప్రజలకు ఏవిధంగా అందించవచ్చనే విషయమై అవగాహన కల్పించారు.

మాంసం దుకాణదారులకు నోటీసులు

నందిపేట్: మండల కేంద్రంలోని మాంసం విక్రయదారులకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం నోటీసులు జారీ చేశారు. కుక్కల సంతతి ఎక్కువ కావడానికి మండల కేంద్రంలోని మాంసం దుకాణాలు తమ వ్యర్థాలను గ్రామ శివారుల్లో విచ్చలవిడిగా పారేయడంతో కుక్కల సంఖ్య పెరుగుతోందని ఫిర్యాదులు రావడంతో నోటీసులు జారీ చేశారు. నందిపేట జీపీ కార్యదర్శి నవీన్ కుమార్ ప్రతి దుకాణానికి వెళ్లి తమ తమ వ్యర్థాలను డంప్ యార్డులో వేయాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రాపర్టీ పై లోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీతం+ కమీషన్. ఫోన్ : 7988242391. [SCA-24000238]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th-డిగ్రీ, శాలరీ: 20k-30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463. [G-9030]

■ త్రినేత్రహోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 17K. Ph : 8520874499, 8520980099 [H-796274]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గణేశ్ మండపాల వద్ద భక్తితో పూజలు



సదాశివనగర్‌లో గణేశ్ మండపం వద్ద భజనలు



బాన్సువాడ వరసిద్ధి వినాయక మండలంలో..



నిజాంసాగర్‌లోని బసవేశ్వర మండపంలో..



దోమకొండలో వినాయక మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్సై

జిల్లాలో ఆయా వినాయక మండపాల్లో లంబోదరుడు ప్రత్యేక పూజలందుకున్నాడు. భజనలు, కీర్తనలు, చిన్నారుల నృత్యాలతో మండపాలు సందడిగా మారాయి. మండపాల వద్ద సాయంత్రం వేళ ప్రత్యేక పూజలు, ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



రామారెడ్డి యువసేన యూత్ ఆధ్వర్యంలో మహిళల కుంకుమార్చన



దేవునిపల్లిలోని శ్రీకృష్ణ పరివార్ కాలనీలో వినాయక మండపం వద్ద కుంకుమార్చన



లింగంపేట పీఎస్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు



తాడ్వాయిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..



ఎల్లారెడ్డిలో గణేశ్ నిమజ్జన మార్గం పరిశీలన



బజరంగ్‌దళ్ గణపతి వద్ద సీఐ, ఎస్సై పూజలు

రైతుల రుణమాఫీ పూర్తయ్యేలా చూడాలి



డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : రైతుల రుణమాఫీ పూర్తయ్యేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఎల్లారెడ్డి మండలంలోని పలు సొసైటీల పరిధిలో కొంతమంది రైతులకు సంబంధించిన రుణాలు మాఫీ కాలేదని వారికి సంబంధించిన రుణాలు మాఫీ జరిగేలా చర్యలను తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సామెల్, గఫార్ తదితరులున్నారు.

నటేశ్వరశర్మ మృతి తీరని లోటు

కామారెడ్డి అర్బన్ : సాహిత్య సృజనశీలి, స్ఫూర్తి శిఖరం డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ అకాల మరణం సాహితీ లోకానికి, ముఖ్యంగా కామారెడ్డికి తీరని లోటని తెలంగాణ రచయిత వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గఫూర్ శిక్షక్, అల్లి మోహన్‌రాజ్ సంతాపం తెలిపారు. కామారెడ్డి ప్రాంతానికి చెందిన అనేక మందిని సాహితీవేత్తలుగా, తెలుగు పండితులుగా తీర్చిదిద్దిన మహనీయుడు నటేశ్వరశర్మ భౌతికంగా లేకున్నా ఆయన సాహితీ ఆశయాలు కొనసాగిస్తామని తెరవే ప్రతినిధులు యెనిశెట్టి గంగాప్రసాద్, మంద పీతాంబర్, నమిలికొండ సునీత, కాసర్ల రామచంద్రం, కొడి రవీందర్, నవీన్‌రెడ్డి, సుదర్శనం రాజయ్య, చంద్రకాంత్ తదితరులు సంతాపం తెలిపారు.

పోషకాహారంపై శ్రద్ధ తీసుకోవాలి



మద్నూర్(జుక్కల్) : గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కళావతి రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మండల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు.

బీర్కూర్‌లో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. రోడ్డు విస్తరణలో భాగంగా రామాలయం వద్ద రోడ్డు పనులు చేస్తుండడంతో పైపులైన్ పగిలి నీళ్లు ఎగిసిపడ్డాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మిషన్ భగీరథ నీళ్లు వృథాగానే పోయాయి. అనంతరం పంచాయతీ అధికారులు వచ్చి నీటి సరఫరాను నిలిపేసి వృథాను అరికట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌లో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. దారావత్ చందు అనే వ్యక్తి తన ఆటోలో అనుమతి లేకుండా రేషన్ బియ్యం తరలిస్తుండగా 8 క్వింటాళ్ల బియ్యం, ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

క్రైం కార్నర్

కాలువలో పడి ఒకరి మృతి



రాజు(ఫైల్)

మాక్లూర్: ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మాదాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాల్వాయి రాజు(37) డిష్‌బాయిగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి రాజు తిరిగి రాలేదు. మంగళవారం సాయంత్రం కాలువలో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జారిపడి వృద్ధురాలు..

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ మండలం సుంకినిలో సోంకాంబ్లెరాజాబాయి (63) అనే వృద్ధురాలు బాత్‌రూంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా జారిపడి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మృతురాలు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని అన్నారు. మృతురాలి కుమార్తె రమాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హాజీపూర్‌లో అటవీ చెట్ల నరికివేత

- 9 మందిపై కేసు నమోదు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ పరిధిలోని హాజీపూర్ అటవీప్రాంతంలో సోమవారం రాత్రి సుమారు 15 ఎకరాల్లో అక్రమార్కులు చెట్లను నరికివేసినట్లు తండావాసులు తెలిపారు. అధికారుల అండదండలతోనే ఈ ప్రాంతంలో కొంతమంది చెట్లను నరికి వేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్‌వో ఓంకార్ చెట్లు నరికిన ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం చెట్లు నరికిన 9 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ఎవరైనా చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని యానంగుట్ట సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన బాలుప్రకాశ్ బొదిరె(40) నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం ఆర్మూర్‌కు వచ్చి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నేళ్లుగా భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. తాగుడికి బానిసగా మారడంతో జీవితంపై విరక్తి చెందిన సోమవారం రాత్రి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి జయబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ సీజ్

సిరికొండ: సిరికొండ రేంజ్ పరిధిలోని తూంపల్లి సెక్షన్ గుడి లింగాపూర్ బీట్ అటవీ ప్రాంతంలో అడవిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకొని సీజ్ చేసినట్లు సెక్షన్ అధికారి కృష్ణగీత్ తెలిపారు. కంపార్ట్‌మెంట్ నెంబర్ 492లో అక్రమంగా అటవీ భూమిని చదును చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బీట్ అధికారులు నగేశ్, హరీశ్, రాజేందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లికి చెందిన రౌడీ షీటర్ నర్ర నవీన్‌ను తహసీల్దార్ కిరణ్మయి ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆర్మూర్‌కు చెందిన నవీన్ ప్రస్తుతం మునిపల్లిలో ఉంటూ తరచూ గొడవలకు పాల్పడుతుండడంతో నవీన్‌పై రౌడీ షీటర్‌గా కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. నవీన్‌కు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

తొమ్మిది మంది..

నిజాంసాగర్(జుక్కల్): అటవీ ప్రాంతంలో చెట్లను నరికి, భూకబ్జాకు యత్నిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని మహమ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయిసింగ్ ఎదుట బైండోవర్ చేసినట్లు బాన్సువాడ రేంజ్ అధికారి అబీబ్ మంగళవారం తెలిపారు. మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం అటవీ ప్రాంతంలో గాంధారి మండలం గండివేట్ తండాకు చెందిన 9 మంది చెట్లను నరుకుతూ, భూమిని చదును చేస్తుండగా పట్టుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశామన్నారు. భూఆక్రమణను అడ్డుకున్న బీట్ అధికారి స్వరూపను రేంజ్ అధికారి అభినందించారు.

వదినను చంపిన మరిది అరెస్ట్



భిక్కనూరు: వదినను హత్య చేసిన మరిదిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని భాగిర్తిపల్లికి చెందిన మంద లావణ్య అలియాస్ యేసుమణిని ఆస్తి తగాదాలతో తన మరిది మంద సురేష్ అలియాస్ యాకూబ్ ఈ నెల 6న హత్య చేసి పరారయ్యాడు. నిందితుడిని ఉదయం పట్టుకొని అరెస్టు చేయగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



కృష్ణమూర్తి

ఖలీల్‌వాడి: దైవదర్శనానికి వెళ్తున్న ఓ వృద్ధుడు జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అదృశ్యమైనట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ గోదావరి జిల్లా భీమవరంకు చెందిన కృష్ణమూర్తి కుటుంబీకులతో కలిసి షిర్డీ వెళ్లేందుకు ఈ నెల 8న నాగర్‌సోల్ రైలును భీమవరంలో ఎక్కారు. 9న జిల్లా కేంద్రానికి చేరుకున్న రైలు నుంచి కృష్ణమూర్తి కుటుంబీకులు అందరూ పడుకున్న సమయంలో అదృశ్యమయ్యాడు. బాసర లో మెలకువ వచ్చిన ఆయన భార్య కృష్ణమూర్తి కోసం వెతుకగా కనిపించకపోవడంతో కుమారుడికి తెలపడంతో వారు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధుడి ఆచూకీ కోసం రెండు స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేసి, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలించగా ఎల్లమ్మగుట్ట కమాన్ నుంచి లోపలికి వెళ్లినట్లు గుర్తించారు. ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి ఆచూకీ ఎవరైనా గుర్తిస్తే వెంటనే 8712658591 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని రైల్వే ఎస్సై సూచించారు.

మహిళను కాపాడిన ఎస్సై

బాసర: ఆత్మహత్యకు యత్నించిన మహిళను ఎస్సై కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రేష్మ గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వస్తున్నట్లు డయల్ 100కు సమాచారం అందింది. దీంతో నిజామాబాద్ జిల్లా నవీపేట, నిర్మల్ జిల్లా బాసర పోలీసులు అప్రమత్తమై తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరి నది బ్రిడ్జి వద్ద మహిళ కనిపించడంతో బాసర ఎస్సై గణేశ్ అప్రమత్తమై కాపాడారు. స్థానిక పీఎస్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

వామ్మో.. ఏఎంసీ పదవా..?

- అనారోగ్యం పాలవుతున్న భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు
- కార్యదర్శిదీ అదే పరిస్థితి..



భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

భిక్కనూరు: వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించిన బాధ్యత తీసుకోవాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన వారే కాదు ఆఖరుకు దానిని నిర్వహించే కార్యదర్శి కూడా అనారోగ్యం పాలవడం చర్చనీయాంశంగా మారింది. మార్కెట్ కమిటీ ఏర్పడి పదేళ్లవుతుండగా, ఐదుగురు చైర్మన్లు పనిచేశారు. తొలి చైర్మన్‌గా నియమితులైన రామేశ్వర్‌పల్లికి చెందిన బాణాల అమృతరెడ్డి, రెండో చైర్మన్‌గా ఆయన భార్య బాణాల సువర్ణ పనిచేశారు. అమృతరెడ్డి కిడ్నీలు ఫెయిల్ కాగా, ఆయన భార్య సువర్ణ ఒక కిడ్నీ ఇచ్చింది. ఇద్దరూ చాలా కాలంపాటు హైదరాబాద్‌లోనే ఉండి చికిత్స పొందారు. ఆ తరువాత చైర్మన్ పదవి పొందిన అంతంపల్లికి చెందిన చిట్టెడి భగవంతరెడ్డి ఆర్థిక ఇబ్బందులపాలై ఆత్మహత్య చేసుకున్నారు. మరో చైర్మన్ పట్లూరి హన్మంత్‌రెడ్డిని కిడ్నీ సమస్య ఇబ్బంది పెట్టింది. వరుసగా ముగ్గురు చైర్మన్లు అనారోగ్యం పాలయ్యారు. ఇదిలా ఉండగా మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న థామస్ సైతం కిడ్నీ సంబంధిత సమస్యతో అనారోగ్యం పాలై కొంతకాలంగా చికిత్స పొందుతున్నాడు.

వాస్తు దోషమే కారణమన్న ప్రచారం..

మార్కెట్ కమిటీ భవన నిర్మాణంలో వాస్తు దోషం కారణంగానే చైర్మన్లుగా పనిచేసిన వారు ఇబ్బందుల పాలవుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఆ కారణంగానే ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలను నియమిస్తున్న నేపథ్యంలో భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై చర్చ నడుస్తోంది.

సంక్షిప్తం

పంటపొలాల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ శివారులో రైతులు సాగుచేస్తున్న పంట పొలాలను మంగళవారం మండల వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్ పరిశీలించారు. కాండం తొలుచు నివారణకు కాట్రాప్ హైడ్రో క్లోరైడ్ ఎకరానికి 400 గ్రాము లు, లేదా క్లొరాంట్రనలిప్రోల్ 60 మిల్లీ మీటర్ల మందును పిచికారి చేయాలన్నారు. పొట్టకుళ్ల నివారణకు ప్రొపికొనజోల్ 200 గ్రా ముల మందును ఎకరానికి పిచికారి చేయాలన్నారు. రైతు నాయకులు కిష్టారెడ్డి, సాయిరెడ్డి తదితరులున్నారు.

రైతులకు రుణాల చెక్కుల అందజేత



రాజంపేట : మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆర్గొండ పరిధిలోని రైతులకు మంగళవారం ఋణమాఫీ అయిన రైతులకు నూతన చెక్కులను అందజేశారు. రుణమాఫీ అయిన రైతులు 237 మందికి రూ. రెండు కోట్లకు పైగా రుణ చెక్కులను సొసైటీ చైర్మన్ కంది శివ రాముల చేతుల మీదుగా ఈ చెక్కులను అందజేశారు. డైరెక్టర్లు బుట్ట రాజు, బాణాల మల్లారెడ్డి, గడ్డం రాజిరెడ్డి తదితరులున్నారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు



మాచారెడ్డి : ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని మాచారెడ్డి ఎంపీడీవో గోపీబాబు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన 33 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమానికి ఎంఈవో ఎల్లయ్య అధ్యక్షత వహించారు. హెచ్ఎం వెంకటాచారి, దేవేందర్ రావు, భాస్కర్, జితన్లాల్, సూర్య ప్రకాష్ గౌడ్, రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు అంతయ్య, గోపికృష్ణ తదితరులున్నారు.

భూములను సర్వే చేయించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను సర్వేచేయించాలని తాడ్వాయి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. శ్మశాన వాటిక స్థలం, పశువుల దవాఖానా నుంచి శబరిమాతాశ్రమం వరకు, జూనియర్ కళాశాల స్థలం, ఊరగట్టుపై ఉన్న మోడల్ స్కూల్‌కు కేటాయించిన ఐదు ఎకరాల భూమిని సర్వేచేయించి హద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మేకల రాజు, సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ షాపులు మూసివేయాలని నోటీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని మూడు మెడికల్ షాపులు మూసివేయాలని కామారెడ్డి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి మంగళవారం నోటీసులు జారీ చేశారు. మండల కేంద్రంలోని మూడు మెడికల్ షాపుల నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సదరు మందుల దుకాణాల్లో సంబంధిత మందుల బిల్లులు లేని కారణంగా మూసి వేయాలని నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నమ్మితే నట్టేట ముంచిన మిత్రుడు

- పొలం రిజిస్ట్రేషన్ చేయాలని కోరితే తనపేరిట చేయించుకున్న వైనం
- నిజం తెలిసి మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్న బాధితుడు

ఖలీల్‌వాడి: నమ్మిన స్నేహితుడు మోసం చేశాడనే మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నాగారంలోని 80 క్వార్టర్స్‌లో నాగరాజు(54) మాధవిలు నివాసం ఉంటున్నారు. మాధవి పెద్దమ్మకు సంతానం లేకపోవడంతో రూరల్ మండలంలోని ముత్తకుంటలో ఉన్న 20 గుంటల పొలాన్ని మాధవిపై రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆమె సిద్ధమైంది. ఈ విషయాన్ని నాగరాజు తన మిత్రుడు మల్లేశ్‌కు చెప్పి తన భార్య మాధవి పేరిట పొలం రిజిస్ట్రేషన్ చేయాలని కోరాడు. ఇదే అదునుగా భావించిన మల్లేశ్.. నాగరాజు భార్య మాధవి పేరుపై కాకుండా తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. వీరు లోన్ కోసం బ్యాంక్‌కు వెళ్తే ఆ భూమి మాధవి పేరిట లేదని తెలిసి కంగుతిన్నారు. ఇదేంటని నాగరాజు దంపతులు మల్లేశ్‌ని ప్రశ్నిస్తే అతను బెదిరించాడు. దీంతో వారు రూరల్ పీఎస్‌లో మూడు నెలల క్రితమే ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సివిల్ కేసు కావడంతో పోలీసులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొంత కాలంగా మానసిక ఒత్తిడికి గురయ్యాడు. కాగా సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి నాగరాజు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మెంట్రాజ్‌పల్లిలో రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న లారీ
- ఒక మృతి, మరొకరికి తీవ్రగాయాలు



ఘటన స్థలిలో క్షతగాత్రులు

జక్రాన్‌పల్లి: డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్‌కు చెందిన ఎల్లుల్ల నర్సుబాయి (72) సుద్దపల్లిలో ఉన్న తన మేనకోడలిని కలిసేందుకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన నారాయణగౌడ్ డిచ్‌పల్లికి వెళ్తున్నట్లు తెలిసి అతని బైక్ ఎక్కింది. ఈ క్రమంలో వీరు మెంట్రాజ్‌పల్లి వద్దకు చేరుకోగానే వెనుక వచ్చిన లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో నర్సుబాయి తలకు, నారాయణ్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా నర్సుబాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నారాయణగౌడ్ చికిత్స పొందుతున్నాడు. మృతురాలి భర్త భోజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడ్డ ముత్తి రమేశ్

కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని క్యాసంపల్లి శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం సిరిసిల్లా జిల్లాకు చెందిన మాలావత్ దినేశ్ పని నిమిత్తం బైక్‌పై కామారెడ్డి వైపు వస్తుండగా.. దోమకొండ మండలం ముత్యంపేటకు చెందిన మంగళి రాములు, ముత్తి రమేశ్ బైక్‌పై కామారెడ్డి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా క్యాసంపల్లి శివారులోని పెట్రోల్ బ్యాంకు సమీపంలో రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైకులపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వీరిని కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో ముగ్గురిని హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై దేవునిపల్లి ఎస్సై రాజును వివరణ కోరగా తమకు సమాచారం అందలేదని తెలిపారు.

వర్నిలో..



వర్ని: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘ టనలో ఇద్దరికి గా యాలైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పాత వర్నికి చెందిన మహేశ్, కోటయ్య క్యాంప్‌నకు చెందిన చంద్రారావు బైక్‌లపై ప్రయాణిస్తుండగా మండల కేంద్రంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్‌లపై ఉన్న ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. నగరంలోని ట్రాఫిక్ పీఎస్ ఎదుట మంగళవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో బోర్గాంకు చెందిన చామకూర లక్‌పతి, ఆదర్శనగర్‌కు చెందిన రావుల మహేశ్ పట్టుబడగా వీరిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. జడ్జి వీరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్రవా హనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.